సాక్షి వికారాబాద్

బుధవారం ၊ 9 ၊ అక్టోబర్ ၊ 2024



గోపాల మిత్రల గోస

పశువులకు వైద్య సేవలు అందిస్తూ వాటి ప్రాణాలు కాపాడుతున్న గోపాలమిత్రల గోసలు ఎవ్వరికీ పట్టడం లేదు. 10లో▸



మెరుగైన సేవలందించండి

ప్రభుత్వాస్పత్రులకు వచ్చే పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సూచించారు. 10లో▸



పాదయాత్రకు తరలిరండి

రైతుల పక్షాన బీఆర్‌ఎస్ తలపెట్టిన పాదయాత్రను సక్సెస్ చేయాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్ కోరారు. 11లో▸



❖ అలంకరణ ఆకర్షణీయం

దౌల్తాబాద్ మండలం బాలంపేటలో మంగళవారం దుర్గామాత మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు నోట్ల(రూ.6,06,666)తో అమ్మవారిని అలంకరించారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు.

– దౌల్తాబాద్

❖ బతుకమ్మ సంబురం

జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు నేత్ర పర్వంగా సాగుతున్నాయి. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ఆట పాటలతో సందడి చేస్తున్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడారు. వేడుకలో కలెక్టర్ ప్రతీక్‌జైన్ పాల్గొన్నారు.

– అనంతగిరి





❖ కళా వైభవం

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో తెలంగాణ కళాకారులు ప్రదర్శన ఇస్తున్నారు. మంగళవారం గరుడవాహనం ఊరేగింపులో జిల్లాకు చెందిన కళాకారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అశోక్ మాస్టర్ నేతృత్వంలో 89మంది విద్యార్థినులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

– బొంరాస్‌పేట

న్యూస్‌రీల్

డీఎస్సీ అభ్యర్థుల తుది జాబితా విడుదల



డీఈఓ రేణుకాదేవి

అనంతగిరి: డీఎస్సీ అభ్యర్థుల తుది జాబితాను మంగళవారం విడుదల చేశారు. డీఈఓ కార్యాలయం, కలెక్టరేట్ వైబ్‌సైట్‌లో జాబితాను ఉంచినట్లు జిల్లా విద్యాధికారి రేణుకాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నేడు(బుధవారం) సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థుల కోసం ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాండూరు నియోజకవర్గ అభ్యర్థుల కోసం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో బస్సు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఉదయం 9గంటల లోపు అభ్యర్థులు రావాలని సూచించారు. అలాగే వికారాబాద్‌లోని బ్లాక్ గ్రౌండ్, కొడంగల్‌లోని ఎమ్మార్సీ సెంటర్ వద్ద, పరిగి పట్టణంలోని మినీ స్టేడియం వద్ద బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి లైజనింగ్ ఆఫీసర్లను నియమించినట్లు పేర్కొన్నారు. వికారాబాద్ నియోజకవర్గానికి బాబు సింగ్ (ఎంఈఓ, సెల్ నంబర్ 94405 83925)ని, పరిగి నియోజకవవర్గానికి గోపాల్ (ఎంఈఓ, సెల్ నంబర్ 94412 82993)ని, కొడంగల్ నియోజకవర్గానికి రామ్ రెడ్డి (ఎంఈఓ, సెల్ నంబర్ 83281 12863)ని, తాండూరు నియోజకవర్గానికి వెంకటయ్య (ఎంఈఓ, సెల్ నంబర్ 95812 48866)ను లైజనింగ్ ఆఫీసర్లుగా నియమించినట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం అభ్యర్థులు పైసూచించిన అధికారులను సంప్రదించాలని తెలిపారు.

అనాథలకు చేయూత అభినందనీయం

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్



చిన్నారుల కుటుంబ సభ్యులకు సరుకులు అందజేస్తున్న రవీంద్రయాదవ్

కొడంగల్ రూరల్: అమ్మా నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాథలకు చేయూతనందించడం అభినందనీయమని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో పాతకొడంగల్, కొండారెడ్డిపల్లి, టేకులకోడ్ గ్రామాలకు చెందిన అనాథ, మతిస్థిమితం లేని చిన్నారుల కుటుంబ సభ్యులకు దసరా పండుగ సందర్భంగా నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మానాన్న ఫౌండేషన్ సేవ లు అభినందనీయమన్నారు. ఫౌండర్ ప్రవీణ్‌కుమార్, తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకుడు రవీందర్‌గౌడ్, నవీన ఆదర్శ ప్లే హైస్కూల్ హెచ్‌ఎం నరేశ్‌రాజ్, ఆర్మీ మాజీ సైనికుడు వెంకటరాములు, నాయకులు గోపాల్, శ్రీనివాస్, నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దసరాకు మరింత కిక్కు

- పండుగ సందర్భంగా గ్రామాలకు భారీగా తరలుతున్న మద్యం
- ఓ వైపు బెల్టు షాపులు.. మరో వైపు కల్లు విక్రయాలు
- కల్తీ కల్లు తాగి ఆస్పత్రిపాలవుతున్న జనం
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న ఎక్సైజ్ శాఖ, పోలీసులు



కిరాణా దుకాణంలో మద్యం బాటిళ్లు



వైన్ షాపు నుంచి ఆటోలో మద్యం తరలిస్తున్న బెల్టుషాపు నిర్వాహకుడు

వికారాబాద్: గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. ఎన్నికల సమయంలో బెల్టు షాపులను కట్టడి చేసిన అధికారులు ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. దసరా పండుగ సమీపిస్తున్న తరుణంలో మద్యం దుకాణాల నుంచి గ్రామాల్లోని బెల్టు షాపులకు భారీగా మద్యం తరలుతోంది. విషయం తెలిసినా ఎక్సైజ్ శాఖ, పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇక కల్లు దుకాణాల విషయం చెప్పనవసరం లేదు. మందు కలపని కల్లు అంటే బంగారంతో సమానం అన్నట్లు మారిపోయింది. కల్తీ కల్లు తాగి జనాలు తరచూ ఆస్పత్రి పాలవుతున్న సంఘటనలు అనేకం. కల్లులో ఆల్ప్రాజోలం లాంటి డ్రగ్ వాడుతుండటంతో ప్రజలు మత్తుకు బానిసలవుతున్నారు. కల్తీ కల్లు, బెల్టు షాపులను కట్టడి చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. గ్రామాల్లో మందుబాబుల హల్‌చల్ చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


మామూళ్ల మత్తులో..

తండాలు, గిరిజన గూడాలు, మారుమూల అటవీ ప్రాంతాల్లో గుడుంబాను కట్టడి చేసిన ఎక్సైజ్ శాఖ అధికారులు బెల్టు షాపుల విషయంలో పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. బెల్టు షాపుల్లో ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారు. హాఫ్, ఫుల్ బాటిల్, బీరు బాటిల్‌పై రూ.10 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఎక్సైజ్ అధికారుల దాడుల్లో పట్టుబడితే మద్యం దుకాణాల నిర్వాహకులు వారికి అండగా నిలుస్తున్నారు. తమకున్న పలుకుబడితో కేసులు కాకుండా చూస్తున్నారు. మద్యం దుకాణాల నుంచి ఎక్సైజ్ శాఖ అధికారులు నెలనెలా మామూళ్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే బెల్టు షాపుల వైపు కన్నెత్తి చూడటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అప్పుడప్పుడు ఉన్నతాధికారుల పేరుతో అదనంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

గల్లీకో బెల్టు దుకాణం

గ్రామాల్లో కిరాణా దుకాణాల కంటే బెల్టు షాపులే అధికంగా ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. మెజార్టీ కిరాణా దుకాణాల్లో మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ఒక్కో ఎక్సైజ్ ఠాణా పరిధిలో 400 వరకు బెల్టు షాపులు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 1,900 బెల్టు షాపులు ఉండగా నిత్యం లక్షల్లో వ్యాపారం జరుగుతోంది. దాబాలు, చిన్నచిన్న షాపుల్లో యథేచ్ఛగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఒక్క రోజుకు మద్యం షాపులో 30శాతం విక్రయాలు ఉంటే బెల్టు షాపుల్లో 70శాతం అమ్మకాలు జరుగుతున్నట్లు సమచారం. నిత్యం రూ.లక్ష అమ్మకాలు దాటని మద్యం షాపుల్లో బెల్టు దుకాణాల కారణంగా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు అమ్మకాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

> **దాడులు చేస్తున్నాం**
>
> దసరా పండుగ నేపథ్యంలో గ్రామాలకు మద్యం తరలించకుండా దాడులు చేస్తున్నాం. బెల్టు షాపులు, అనుమతి లేని కల్లు దుకాణాలపై నిఘా ఉంచాం. మా శాఖలో మామూళ్లకు అవకాశం లేదు. బెల్టు షాపులు, కల్తీ కల్లుపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.
>
> – విజయభాస్కర్‌గౌడ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్



ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అభివృద్ధికి కలిసి సాగుదాం

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ

అనంతగిరి: వేర్వేరు రాజకీయ పార్టీల ద్వారా ప్రజాప్రతినిధులుగా ఎన్నికైనా, చేవెళ్ల ప్రాంత అభివృద్ధి విషయంలో కలిసి సాగుదామని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల అభివృద్ధిపై చర్చించారు. ముఖ్యంగా జీఓ నంబర్ 111 ప్రాంతాన్ని సస్టైనబుల్ డెవలప్‌మెంట్ జోన్‌గా మార్చాలని కోరారు. గత ప్రభుత్వం షాబాద్ మండలం సీతారాంపురంలో ఆలయ భూములను స్వాధీనం చేసుకుందని వాటిని తిరిగి ఆలయానికి కేటాయించాలని కోరారు. జంట నగరాల్లో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్వహణపై,కాళేశ్వరం ప్రాజెక్టుపై పలు సూచనలు చేసినట్లు తెలిపారు.రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం, పెండింగ్ సమస్యలపై లోతైన చర్చ చేసి సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించినట్లు తెలిపారు.

రేపటి నుంచి సదరం క్యాంపులు

అనంతగిరి: తాండూరులోని జిల్లా ఆస్పత్రి, వికారాబాద్‌లోని సీహెచ్‌సీలో ఈ నెల 10 నుంచి సదరం క్యాంపులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాండూరు జిల్లా ఆస్పత్రిలో ఈ నెల 10న శారీరక వైకల్యం కలిగిన 60 మందికి, 14న బుద్ధి మాంద్యం ఉన్న 50 మందికి, 24న శారీరక అంగవైకల్యం కలిగిన 60 మందికి, 28న బుద్ధి మాంద్యం కలిగిన 50 మందికి, 30న వినికిడి లోపం గల 60 మందికి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. వికారాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఈ నెల 10న శారీరక వైకల్యం ఉన్న 60 మందికి, 18న చూపులేని 50 మందికి, 24న బుద్ధి మాంద్యం కలిగిన 50 మందికి, 29న శారీరక వైకల్యం కలిగిన 60 మందికి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే సదరం సర్టిఫికెట్ పొంది, కాలపరిమితి ముగిసిన వారితో పాటు కొత్తగా స్లాట్ బుక్ చేసుకున్న వారితో కలిపి 500 మందికి పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



పత్తి సేకరణపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

పత్తి కొనుగోలుకు సిద్ధంకండి

కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పత్తి కొనుగోలుపై సంబంధిత అధికారులు, ట్రేడర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో సుమారు 2లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని, జిన్నింగ్ మిల్లులు వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. పత్తి కొనుగోలుకు రైతుల ఆధార్ కార్డు ప్రామాణికమని, అన్నదాతలు తమ బ్యాంక్ ఖాతాలను ఆధార్ నంబరుకు అనుసంధానం చేసుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆన్‌లైన్‌లో నమోదు కాని రైతుల జాబితాను ఏఈఓ సర్టిఫై చేస్తే ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది క్వింటాలు ఏ గ్రేడ్ పత్తికి రూ.7,521లు, బీ గ్రేడ్‌కు రూ.7,121లు మద్దతు ధర ప్రకటించినట్లు తెలిపారు. పత్తి మిల్లుల వద్ద తూకం యంత్రాల పని తీరును పరిశీలించాలని తూనికలు కొలతల శాఖ అధికారులకు సూచించారు. మిల్లుల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా అగ్ని మాపక శాఖ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోలీస్, రవాణా అధికారులు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జిన్నింగు మిల్లుల వద్ద తగు ఏర్పాట్లు చేయాలని, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ సెలవు దినాల్లో జిన్నింగ్ మిల్లులకు పత్తి తీసుకరాకూడదని రైతులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, మార్కెటింగ్ శాఖ అధికారి సారంగపాని, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ పీ రవీందర్ రెడ్డి, విద్యుత్, రవాణా, పోలీస్ శాఖ అధికారులు, ట్రేడర్లు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలో విద్యకు పెద్దపీట

- 1,003 గురుకులాల ఏర్పాటుతో 6లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- సీఎం రేవంత్.. మంత్రుల మాటలకు పొంతన లేదని ఆరోపణ



మెమొంటో అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే సబితారెడ్డి

ధారూరు: సీఎం రేవంత్‌రెడ్డి ఒకమాట మాట్లాడితే, మంత్రులు మరోమాట మాట్లాడుతున్నారని, అధికారులు ఇంకో రకంగా మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఎద్దేవా చేశారు. ధారూరులో 2023 – 24 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు స్వర్గీయ మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కొస్నం లక్ష్మారెడ్డి జ్ఞాపకార్థం మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో జిల్లాకు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల తీసుకవస్తామని హామీ ఇచ్చారని, దాన్ని కొడంగల్‌లో కాకుండా వికారాబాద్‌లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లా వాసి అని చెప్పుకునే సీఎం చిత్తశుద్ధి ఉంటే ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రతి నియోజకవర్గానికి ఒక ఇంటర్నేషనల్ స్కూల్ తెస్తామన్న సీఎం ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 1,003 గురుకులాలను ఏర్పాటు చేసి 6లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు మంచి చదువు అందించాలనే లక్ష్యంతో కేసీఆర్ ముందుకు వెళ్లారని గుర్తుచేశారు. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించేందుకు కేసీఆర్ శ్రమించారని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం విద్య పట్ల చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో ఆరు వేల స్కూళ్లను మూసి వేశారని సీఎం రేవంత్ ఆరోపణల్లో నిజం లేదన్నారు. అసలు ఆరు వేల స్కూళ్లు ఎక్కడ ఉన్నాయో చెప్పాలని ప్రశ్నించారు. పదో తరగతి విద్యార్థులకు రూ.10 వేలు, ఇంటర్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ విద్యార్థులకు రూ.20 వేలు ఇస్తామన్న సీఎం ఎంత మందికి డబ్బులు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి, అమ్మాయిలకు స్కూటీ ఎప్పుడు ఇస్తారో చెప్పాలన్నారు. ఉద్యోగ నియామకాల్లో పచ్చి అబద్ధాలు చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వర్గీయ కొస్నం లక్ష్మారెడ్డి పేరిట మెమొంటోలు అందజేసి విద్యార్థులను ప్రోత్సహిస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు సుజాతను అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ విజయకుమార్, సబితా ఆనంద్ ఫౌండర్ సబితా ఆనంద్, బీఆర్‌ఎస్ నాయకులు శుభప్రదపటేల్, శ్రీకాంత్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, చంద్రమౌళి, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బండవెల్కిచర్ల పాఠశాలలో అభివృద్ధి పనులపై ఆరా తీస్తున్న డీఆర్డీఓ పీడీ శ్రీనివాస్

నిబంధనల మేరకే బిల్లుల చెల్లింపు

కుల్కచర్ల: ప్రభుత్వ నిబంధనల మేరకే అమ్మ ఆదర్శ కమిటీలకు బిల్లులు చెల్లించడం జరిగిందని డీఆర్డీఓ పీడీ శ్రీనివాస్ తెలిపారు. పాఠశాలల్లో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు సక్రమంగా రావడం లేదని మహిళా సంఘాల ప్రతినిధులు కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేప థ్యంలో మంగళవారం మండలంలోని అన్ని పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో జరిగిన అభివృద్ధి పనులను నాలుగు బృందాలు పరిశీలించి వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు. కూలీల విషయం మినహా బిల్లులు సక్రమంగా వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, పంచాయతీ రాజ్ ఏఈ మణికుమార్, ఏపీఓ చంద్రశేఖర్, ఏపీఎం శోభ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాకు స్వచ్ఛందంగా భూములు

- హకీంపేట్‌కు చెందిన వంద మంది రైతులు సిద్ధం
- 210 ఎకరాల భూమి ఇచ్చేందుకు అంగీకారం

దుద్యాల్: మండలంలోని హకీంపేట, పోలేపల్లి, లగచెర్ల, పులిచెర్ల తండా, రోటిబండ తండా గ్రామాల్లో ఫార్మా కంపెనీ ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందుకోసం భూములను గుర్తించి నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే ఫార్మాకు భూములు ఇచ్చేది లేదని పలు గ్రామాల రైతులు ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నారు. కానీ హకీంపేట సర్వే నంబర్ 252లో 210 ఎకరాల భూములు ఉన్న వంద మంది రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చేందుకు మంగళవారం ముందుకు వచ్చారని కాంగ్రెస్ పార్టీ దుద్యాల్ వర్కింగ్ ప్రసిడెంట్ సంజీవరెడ్డి తెలిపారు. ఈ మేరకు రైతులు రాత పూర్వకంగా రాసి ఇచ్చినట్లు తెలిపారు. ప్రతి రైతు నుంచి హామీ పత్రంపై సంతకం తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.



ఫార్మా కంపెనీకి భూమి ఇచ్చేందుకు సిద్ధమని సంతకం చేస్తున్న మహిళా రైతు

క్లుప్తంగా

భక్తుల కొంగుబంగారం.. పోలేపల్లి ఎల్లమ్మతల్లి



హోమంలో పాల్గొన్న భక్తులు

దుద్యాల్: తెలంగాణలో మేడారం జాతర తర్వాత అంతటి ఆదరణ ఉన్నది పోలేపల్లి రేణుక ఎల్లమ్మ తల్లి. మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో స్వయంభుగా వెలిసిన ఈ అమ్మవారు ఎంతో మంది భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. ఈ ఆలయంలో దేవిన వరాత్రి ఉత్సవాల సందర్భంగా నిత్య హోమాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ రాజేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం అమ్మవారు లక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారి మాలధారణ చేపట్టిన భక్తులు దర్శనానికి పెద్ద ఎత్తు హాజరయ్యారు.

సెల్‌ఫోన్ అప్పగింత

కొడంగల్ రూరల్: రద్దీ ప్రాంతాల్లో చోరీలకు అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ జీవీ సత్యనారాయణ సూచించారు. ఇటీవల సెల్‌ఫోన్ పోగుట్టుకున్నట్లు రుద్రారం గ్రామానికి చెందిన శేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ యాప్‌తో ట్రేస్ చేసి పట్టుకున్నామన్నారు. మంగళవారం స్టేషన్ ఆవరణలో శేఖర్‌కు ఫోన్ అందజేశామన్నారు.

గని కార్మిక సంఘం ఇన్‌చార్జి చైర్మన్‌గా పండరి



పండరికి నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: మండల పరిధిలోని మల్కాపూర్ గని కార్మిక సంఘం ఇన్‌చార్జి చైర్మన్‌గా మల్కాపూర్‌కు చెందిన ఎస్.పండరి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు. డైరెక్టర్లుగా రాందాస్, మల్లేశం, నర్సింలు, మౌలానా, గోపాల్‌ను నియమించారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, కరన్‌కోట్ ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాజ్‌కుమార్ ఉన్నారు.

ఈగల్ కుంగ్‌ఫూ పోటీల్లో కేజీబీవీ సత్తా



కేజీబీవీ విద్యార్థినులను అభినందిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

కొడంగల్ రూరల్: షాద్‌నగర్ పట్టణంలోని గ్రీన్‌పార్క్ ఫంక్షన్‌హాల్‌లో ఈగల్ కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో ఓపెన్ నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాపియంస్ షిప్–2024 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కొడంగల్ కేజీబీవీ విద్యార్థినులు సత్తా చాటారు. ఈ మేరకు విద్యార్థినులను మంగళవారం ఎస్పీ నారాయణరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం

చేవెళ్ల: వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని.. వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పక ఉండాలని చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశం అన్నారు. మంగళవారం ట్రాఫిక్ పోలీసులు ముడిమ్యాల–తోల్‌కట్ట గేట్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ పండగకు సొంతూళ్లకు వెళ్లే వారు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించడంతో వారు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారన్నారు. అలాంటి వాహనాలను గుర్తించి వారికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

గోపాల మిత్రల గోస

- అరొకర జీతాలతో అవస్థలు
- పశుసంవర్ధక శాఖలో విలీనం చేయాలని డిమాండ్
- పట్టించుకోని పాలకులు



వ్యాధి నివారణ టీకా వేస్తున్న గోపాలమిత్ర (ఫైల్)

దుద్యాల్: పశువులకు వైద్య సేవలు అందిస్తూ ప్రాణాలు కాపాడుతోన్న గోపాలమిత్రలు గోసలు పట్టించుకునే వారు కరువయ్యారు. 24 గంటలు రైతులకు అందుబాటులో ఉంటూ ఫోన్ చేయగానే ఆయా గ్రామాలకు, పొలాలకు, పశువుల షెడ్ల దగ్గరకు వెళ్లి వాటి అనారోగ్య కారణాలు తెలుసుకుని సేవలు అందిస్తున్నా గుర్తించే వారే లేరు. 24 ఏళ్లుగా టీఎల్‌డీఏ సంస్థలో గోపాల మిత్రలుగా మూగ జీవాలకు సేవలందిస్తున్న నేటికీ ఏ ప్రభుత్వం తమ సేవలకు సరైన గుర్తింపు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్యాంపుల్లో సేవలు

ప్రతీ సంవత్సరం వర్షకాలం, చలికాలం, వేసవికాలంలో ప్రభుత్వం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే గాలికుంటు వ్యాధి నివారణ టీకా క్యాంపులు, డీవార్మింగ్ క్యాంపు, జబ్బవాపు, గొంతువాపు, చిటుక రోగం వంటి వివిధ రకాల వ్యాధులకు సంబంధించి గ్రామాల్లో నిర్వహించే క్యాంపుల్లో గోపాల మిత్రల సేవలను ప్రభుత్వం వినియోగించుకుంటోంది. కృత్రిమ గర్భధారణ టీకా సైతం గోపాలమిత్రలే అందిస్తున్నారు. పశుసంవర్ధకశాఖలో గోపాలమిత్రలను విలీనం చేసి పే స్కేల్ ఇవ్వాలని గోపాలమిత్రలు డిమాండ్ చేస్తున్నారు.

భారంగా మారిన పోషన

రాష్ట్రంలో దాదాపుగా 1,530 మంది గోపాల మిత్రలుండగా జిల్లాలో 34 మంది ఉన్నారు. వీరంతా పశువైద్య సేవలోనే ఉంటూ చాలి చాలని జీతాలతో జీవనం వెళ్లదీస్తున్నారు. వీరికి ప్రభుత్వం నెలకు రూ.11,050లు పారితోషికం చెల్లిస్తోంది. ఇవి కూడా ప్రతీ నెల రాకపోవడంతో కుటుంబపోషన భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



24 ఏళ్లుగా పశువైద్య సేవలు అందిస్తున్నాం. రైతులు ఎప్పుడు ఫోన్ చేసినా స్పందిస్తూ పశువుల రోగాలు నయం చేస్తున్నాం. మా సేవలు గుర్తించి ప్రభుత్వం పశుసంవర్ధకశాఖలో విలీనం చేసి పే స్కేల్ అమలు చేయాలి. ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలి.

రఘురామకృష్ణ గౌడ్, గోపాల మిత్ర, హస్నాబాద్

క్రమబద్ధీకరించాలి



పశుసంవర్ధక శాఖ చేపట్టే ప్రతీ క్యాంపులో పాల్గొంటూ శిబిరాన్ని విజయవంతం చేస్తున్నాం. కృత్రిమ గర్భధారణ టీకాతో పశుగణాభివృద్ధిని పెంపొందిస్తున్నాం, నెలకు రూ.11,050ల పారితోషికం అందిస్తున్నారు. దీంతో కుటుంబం గడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం తమను రెగ్యులరైజ్ చేయాలి.

శివకుమార్, గోపాల మిత్ర, పెద్దనందిగామ

ఆశగా ఎదురుచూస్తున్నాం



24 ఏళ్లుగా పశువులకు వచ్చే రోగాలు నయం చేస్తూ ప్రాణాలు కాపాడుతున్నాం గత ప్రభుత్వం పశుసంవర్ధకశాఖతో అనుసంధానం చేస్తామని హామీ ఇచ్చింది కానీ పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం గోపాల మిత్రల సేవలను గుర్తించి తమకు ఉద్యోగభద్రత కల్పిస్తుందని ఎదురుచూస్తున్నాం.

బందెప్ప, గోపాల మిత్రల జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్.

పీఆర్టీయూ రాష్ట్ర కమిటీలో చోటు



రామాంజనేయులు మధుసూదన్ వెంకటయ్య శ్రీధర్ రెడ్డి రవికాంత్ రెడ్డి

పరిగి/బషీరాబాద్: జిల్లాలోని పలువురు ఉపాధ్యాయ సంఘం నాయకులకు పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో చోటు దక్కింది. వీరిలో పరిగి మండలానికి చెందిన రామాంజనేయులు, మధుసూదన్, వెంకటయ్య, బషీరాబాద్ మండలానికి చెందిన శ్రీధర్‌రెడ్డి, రవీకాంత్‌రెడ్డి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా నియమితులయ్యారు. పరిగి మండల ఉపాధ్యాయులు నర్సింహులుగౌడ్, శ్రీనివాస్, బషీరాబాద్ మండల టీచర్లు నాగరాజు, సాజిదాబేగం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. పరిగికి చెందిన ప్రకాశ్, రాములు, కిష్టయ్య, రాజశేఖర్‌రెడ్డి కార్యదర్శులుగా ఎంపికయ్యారు. వీరితో పాటు బషీరాబాద్‌కు చెందిన భీంరెడ్డి, అయూబ్‌పాషా రాష్ట్ర కమిటీలో స్థానం సాధించారు.

ఆగిఉన్న లారీని ఢీకొట్టిన కారు

ఇద్దరికి తీవ్ర గాయాలు



ఘటనా స్థలిలో నుజ్జునుజ్జయిన కారు

పరిగి: ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని రంగాపూర్‌లో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన దేవరాజ్, దేవానంద ఇద్దరూ హైదరాబాద్‌కు వచ్చి పురుగుమందు తీసుకుని తిరుగుప్రయాణమయ్యారు. ఈ క్రమంలో రంగాపూర్‌లో హైదరాబాద్–బీజాపూర్ జాతీయరహదారిపై రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. దీంతో కారులో ఉన్న ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

‘అభివృద్ధిని ఓర్వలేకే పాదయాత్ర’

బొంరాస్‌పేట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్‌ఎస్ నేతలు పాదయాత్రలు చేపడుతున్నారని, వీటిని అడ్డుకుంటామని కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు. మంగళవారం తుంకిమెట్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రేవంత్‌రెడ్డి హయాంలో కొడంగల్ ప్రాంతం ఎంతో అభివృద్ధి సాధిస్తోందని తెలిపారు. ఇది తట్టుకోలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకు చూస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, అంజిల్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

నీటి కలుషితాన్ని అరికట్టాలి

మిషన్ భగీరథ ఉమ్మడి జిల్లా ఎస్‌ఈ ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఈ ఆంజనేయులు

మోమిన్‌పేట: గ్రామ పంచాయతీలకు సరఫరా అవుతున్న మిషన్ భగీరథ నీరు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత గ్రామీణ తాగునీటి సహాయకులదేనని మిషన్ భగీరథ ఉమ్మడి జిల్లా ఎస్‌ఈ ఆంజనేయులు అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో రెండో రోజు శిక్షణ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీటిని మోతాదు మేరకు సరఫరా చేయాలన్నారు. వృథాను అరికట్టాలని సూచించారు. ఎప్పటికప్పుడు ట్యాంకులను శుభ్రం చేయాలని.. చేతి పంపుల మరమ్మతులను సహాయకులే చేయాలన్నారు. లీకేజీలు లేకుండా వెంటనే మరమ్మతులు చేపట్టడం. ప్రతీ పదిరోజులకు ట్యాంకులను శుభ్రం చేయడం తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈఈ రత్న ప్రసాద్, సుచరిత, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీఓ యాదగిరి, ఏఈఈ అభిషేక్, ల్యాబ్ టెక్నికల్ అధికారి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

నష్టం వాటిల్లకుండా రోడ్డు విస్తరణ

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



అమ్మవారి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: రోడ్డు విస్తరణ పనులకు స్థానికులు, వ్యాపారస్తులు సహకరించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. మంగళవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి రోడ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పూలే విగ్రహం నుంచి జేపీ దర్గా కూడలి వరకు రూ.18 కోట్లు, పాత జాతీయ రహదారి నుంచి కుమ్మరిగూడ వరకు రూ.32 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ పనుల్లో వ్యాపారులకు, ప్రజలకు సాధ్యమైనంత వరకు నష్టం వాటిల్లకుండా పనులు చేపడతామన్నారు. పెరుగుతోన్న రద్దీ, పట్టణీకరణకు రోడ్ల విస్తరణ తప్పనిసరి అన్నారు. గత ప్రభుత్వం రోడ్ల అభివృద్ధికి ప్రకటనలు చేసింది తప్ప పనులు ప్రారంభించలేదని విమర్శించారు. విడతల వారీగా నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం 5వ వార్డులో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, నాయకులు దేవేందర్‌ముదిరాజ్, నవీన్‌చారి, నర్సింహ, జనార్దన్‌చారి, హరినాథ్‌రెడ్డి, లక్ష్మయ్య, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: క్రీడల్లో గెలుపోటములు సహజమని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్న కానిస్టేబుళ్లకు స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, 100, 200 మీటర్ల పరుగుపందెం, క్రికెట్ పోటీలు చేపట్టారు. ముగింపు సమావేశంలో ఎస్పీ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గెలుపు కన్నా క్రీడల్లో పాల్గొనడం చాలా ముఖ్యమన్నారు. ఓటములే జీవిత పాఠాన్ని నేర్పుతాయన్నారు. ప్రతిఒక్కరూ విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకోవాలని ఆయన తెలిపారు. క్రీడలు మానసికోల్లాసంతో పాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో డీటీసీ ప్రిన్సిపాల్ మురళిదర్, ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, డీటీసీ డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేద్దాం

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్‌కుమార్

తాండూరు రూరల్: తాండూరు నియోజకవర్గంలో బీజేపీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేద్దామని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్ కుమార్ పేర్కొన్నారు. బీజేపీ అనుబంధ సంస్థ ధార్మిక సెల్ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ రాజశేఖర్ మంగళవారం తన బృందంతో రమేశ్‌కుమార్‌ను కలిశారు. ఆధ్యాత్మికతకు సంబంధించి దేవాలయాలను పరిరక్షించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ధార్మిక సెల్ బృందం సభ్యులు రమేశ్‌కుమార్ సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణముదిరాజ్, ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ మోహన్‌రెడ్డి, జాయింట్ కన్వీనర్లు రాఘవేందర్, వినోద్‌జైన్, నాయకులు భద్రేశ్వర్, లక్ష్మణ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించండి

ఆస్పత్రి అభివృద్ధికి కృషి

- మూడోసారి కాయకల్ప అవార్డు దక్కడం హర్షణీయం
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



తాండూరు టౌన్ ఎంసీహెచ్ పిల్లల వార్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు టౌన్: ప్రభుత్వాస్పత్రులకు వచ్చే పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన పట్టణంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్ని వార్డుల్లో తిరిగి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. పిల్లల వార్డు, నవజాత శిశువు వార్డు, ఆపరేషన్ థియేటర్, మహిళల వార్డులను పరిశీలించారు. ఎంసీహెచ్‌లో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు, సిబ్బంది వివరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిశంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. నవజాత శిశువు వార్డులో ఆక్సిజన్ కంప్రెసర్ యూనిట్ కావాలని, పేషెంట్ అటెండర్స్ కోసం ఒక షెడ్డు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. రాత్రి వేళ ఆసుపత్రి భద్రత కోసం పోలీసు ఔట్ పోస్టును ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఆసుపత్రి ఎదుట సిబ్బంది, రోగుల కోసం ఆర్టీసీ రిక్వెస్ట్ బస్‌స్టాప్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఎమ్మెల్యే బీఎమ్మార్ మాట్లాడుతూ ఆక్సిజన్ కంప్రెసర్ యూనిట్ ఏర్పాటుకు కలెక్టర్ రూ.4లక్షల నిధులు మంజూరు చేశారని.. కాయకల్ప అవార్డు కింద వచ్చే రూ.25లక్షల్లో మరో రూ.4లక్షలు వెచ్చించి వెంటనే పరికరాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. పోలీసు ఔట్ పోస్టు ఏర్పాటుకు ఎస్పీ నారాయణ రెడ్డిని ఫోన్‌లో సంప్రదించారు. ఆర్టీసీ డీఎం సురేశ్‌కుమార్‌కు ఫోన్ చేసి రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటు చేయాలన్నారు. షెడ్, మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. మూడోసారి తాండూరు ఆస్పత్రికి కాయకల్ప అవార్డు దక్కడం హర్షణీయమన్నారు. ఎమ్మెల్యే వెంట డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ప్రదీప్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నాపరిమళ్, కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డి, డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ధారాసింగ్, అబ్దుల్ రవూఫ్, మసూద్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

తాండూరు టౌన్/యాలాల: సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతోందని ఎమ్మెల్యే మనోమర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో పెద్దేముల్, యాలాల మండలాలకు చెందిన 45 మంది లబ్ధిదారులకు రూ.14లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరణం పురుషోత్తంరావు, ధారాసింగ్, ఏఎంసీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సిద్రాల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ భీమప్ప, మధుసూదన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు వీరేశం, ఖాసీం, రఘురాంరెడ్డి తదితరులు ఉన్నారు.

‘గృహజ్యోతి’కి దరఖాస్తు చేసుకోండి

కొడంగల్ రూరల్: గృహజ్యోతి పథానికి సంబంధించి జీరో బిల్స్ రాని విద్యుత్ వినియోగదారులు మండల పరిషత్ లేదా మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఏడీఈ నవీన్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న రసీదు(ఉన్నట్లయితేనే), ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కరెంటు బిల్లు, గ్యాస్‌బుక్‌ల జిరాక్స్‌లతోపాటు కుటుంబ యజమాని లేదా సభ్యుల ఫోన్‌తో సంబంధిత కార్యాలయానికి రావాలని తెలిపారు. ఓటీపీ నంబర్ ద్వారా అప్లికేషన్ ఓపెన్ అవుతుందని వివరించారు.

యువతితో అసభ్య ప్రవర్తన

యువకుడిపై కేసు

కుల్కచర్ల: యువతిపై అసభ్యంగా ప్రవర్తించిన ఓ యువకుడిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని పుట్టపహాడ్‌కు చెందిన రఘు(24) సోమవారం సాయంత్రం పశువులు కాస్తున్న క్రమంలో ఇదే గ్రామానికి చెందిన యువతి(22)తో అసభ్యంగా ప్రవర్తించాడు. ప్రతిఘటించిన ఆమె ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పింది. తమకు అందిన ఫిర్యాదు మేరకు రఘుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

నవాబుపేట: రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసిన సంఘటన గుబ్బడి ఫతేపూర్లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ అరుణ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. భువనగిరికి చెందిన శ్రీకాంత్ మండల పరిధిలోని గుబ్బడి ఫతేపూర్లో 5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తక్కువ ధరలకు కొనుగోలు చేసి బియ్యం వ్యాపారులకు అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి వెళ్లి బియ్యం ఉన్న ఆటోను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

నేడు ‘చలో శంషాబాద్’

- మాదిగలను మోసం చేసిన ముఖ్యమంత్రికి బుద్ధిచెబుదాం
- ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కిరణ్ పూలే



మాట్లాడుతున్న కిరణ్‌పూలే తదితరులు

తలకొండపల్లి: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం శంషాబాద్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కిరణ్ పూలే అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ కులాల వర్గీకరణకు ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకువచ్చి ఉద్యోగ నియామకాలకు వర్తించేలా చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట ఇచ్చి తప్పారని ఆరోపించారు. మాట ఇచ్చి తప్పిన సీఎంకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. శంషాబాద్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. మాదిగ విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నాయకులు నారాయణ, శ్రీశైలం, మహేశ్, ప్రహ్లాద్, వంశీ, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రూ.500 కోట్లు కేటాయించండి



మాట్లాడుతున్న గోపి రజక

రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి

దుద్యాల్: రజకుల సంక్షేమం కోసం రూ.500 కోట్లతో ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక డిమాండ్ చేశారు. మంగళవారం ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో గోపి రజక మాట్లాడుతూ.. 2016లో ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రజకుల సంక్షేమ కోసం పై గొంతెత్తారని.. ప్రస్తుతం ఆయన సీఎంగా ఉన్నందున తమ సంక్షేమానికి బడ్జెట్ కేటాయించి అభ్యున్నతికి తోడ్పడాలని కోరారు. గత బడ్జెట్‌లో రూ.150 కోట్లు కేటాయించినా అందులో రూ.100 కోట్లు విద్యుత్ బకాయిలకు, మిగిలిన రూ.50 కోట్లు రజకుల సంక్షేమానికి కేటాయించారు. రజకులకు ప్రత్యేకంగా రూ.500 కోట్లు కేటాయించి సంక్షేమానికి సహకరించాలని కోరారు. అనంతరం గ్రామానికి చెందిన వార్డు మాజీ మెంబర్ చెన్నప్ప రజకను సన్మానించారు. రజక రిజర్వేషన్ సమితి వికారాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్, సంయుక్త కార్యదర్శి వెంకటయ్య, దుద్యాల్ ఉపాధ్యక్షుడు అంజయ్య, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సాయిలు, మొగులయ్య, వెంకటయ్య, అనంతయ్య, భీములు, బుగ్గప్ప తదితరలు పాల్గొన్నారు.